క్లుప్తంగా

గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న గుంటి గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యతో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన గూడూరి గురకయ్య అనారోగ్య కారణంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆసుపల్లి రామలక్ష్మమ్మ రూ.2000 ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపల్లి చెన్నారెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కంభం: స్థానిక కందులాపురం కూడలిలో హైవేకి ఓ వైపు 11 కేవీ విద్యుత్ స్తంభాలకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీగలు తెగి పడి అక్కడ ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తెగిపడిన తీగలు హైవేని ఆనుకొని ఉన్న ఆలయంపై పడటంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. సుమారు మూడు గంటల సేపు విద్యుత్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

కంభం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు, పాత్రికేయులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు, పట్టణంలో పలువురు యువకులు 130 మంది వరకు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పోలీసులు పండ్లు, జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐ కె.మల్లిఖార్జున, కంభం, బేస్తవారిపేట, అర్థవీడు ఎస్సైలు నరసింహారావు, రవీంద్రరెడ్డి, సుదర్శన్, కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

29న మున్సిపల్ రూముల వేలంపాట

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి వివిధ సెంటర్‌లలోని 10 షాపులు, 2 బంకులకు ఈ నెల 29న ఉదయం 11గంటలకు కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ నారాయణరావు ఆదివారం తెలిపారు. పట్టణ పరిధిలోని కొత్త మార్కెట్ పడమర వైపు, దక్షిణం వైపు, ఈ సేవా సెంటర్, పాత బస్టాండ్ పడమర వైపు, అయ్యప్ప స్వామి గుడి ఎదురు వైపు, పాత మార్కెట్ సెంటర్ తూర్పువైపు, గాంధీ పార్కు సెంటర్ దక్షిణం వైపు ఉన్న మొత్తం 10 షాపులు, రెండు బంకులకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ షాపులు మూడేళ్ల పాటు వేలంపాటదారుడు నిర్వహించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు కార్యాలయం పనివేళలల్లో రెవెన్యూ విభాగంలో అధికారులను సంప్రదించవచ్చన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొదిలి రూరల్: పవిత్ర కార్తీక మాసంలో భక్తులు వివిధ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు పొదిలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం జె.సుందరరావు తెలిపారు. వచ్చే నవంబర్ 4వ తేదీ నుంచి ప్రతి కార్తీక సోమవారం పంచారామదర్శనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అమరారామం, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారరామాలకు వెళ్లేందుకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తుల కోరిక మేరకు కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు కార్తీక పౌర్ణమిరోజున బస్సులు బయలుదేరుతాయన్నారు. ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.1700, సూపర్‌లగ్జరీ చార్జీ రూ.2200 నిర్ణయించారు.

హరిశ్చంద్రా.. ఈయనే సత్యకీర్తి!

పౌరాణికమైనా, జానపదమైనా, సాంఘిక నాటకమైనా ఇద్దరు వ్యక్తులు ఆ పాత్రల్లో ఒదిగిపోతారు. సాధారణ మెకానిక్‌గా ఒకరు, పాత్రికేయునిగా మరొకరు తమ విధులను నిర్వహిస్తూనే కళామతల్లి ముద్దు బిడ్డలుగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటుండటం విశేషం. మండల కేంద్రానికి చెందిన కళాకారులు ముత్తలూరి శివశంకరాచారి, మందలపు కాశిరెడ్డి సేవలు ప్రశంసనీయం.

– పెద్దదోర్నాల

- నటనలో పరిపూర్ణత్వాన్ని ప్రదర్శిస్తున్న ఇద్దరు కళాకారులు
- ఒకరు విలేకరి.. మరొకరు మెకానిక్
- ఒకరు హరిశ్చంద్రునిగా.. మరొకరు సత్యకీర్తిగా ఆ పాత్రలకు ప్రాణం
- మెకానిక్‌కు డాక్టరేట్ ప్రదానం
- రంగస్థల అభిమానుల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న కళాకారుల ద్వయం



సత్యకీర్తి వేషధారణలో మందలపు కాశిరెడ్డి

వృత్తిలో ఒత్తిడి ఉన్నా..



మందలపు కాశిరెడ్డి (ఫైల్)

నాటకరంగమంటే అమితమైన ఆసక్తి ఉన్న మందలపు కాశిరెడ్డి ఆంధ్ర భూమి దినపత్రికలో పాత్రికేయునిగా విధులు నిర్వహించేవారు. ఈ క్రమంలోనే నాటక రంగంపై ఎనలేని మమకారాన్ని పెంచుకున్నారు. కాలేజీ రోజుల్లోనే కళాశాల స్థాయిలో జరిగే సాంఘిక నాటకాల బాధ్యతలు నిర్వహిస్తూనే ఆ నాటకాల్లోని పలుపాత్రలను అద్భుతంగా నటిస్తూ అధ్యాపకులు, తోటి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నారు. పాత్రికేయునిగా విధులు నిర్వహిస్తూనే భక్త మార్కండేయ నాటకంలో చిత్రగుప్తుడిగా, హరిశ్చంద్ర నాటకంలో సత్యకీర్తిగా, కాలకౌశికుడిగా, శ్రీకృష్ణరాయబారంలో అర్జునుడిగా, బాలనాగమ్మ నాటకంలో తలారి రాముడి, చాకలి తిప్పడుగా నాటకాల్లో ఎన్నో పాత్రలను పోషించారు. శ్రీకృష్ణరాయబారంలో అర్జునుడి పాత్రను హృదయాత్మకంగా పోషించి ఎందరో కళాకారుల ప్రశంసలు అందుకున్నారు. స్థానిక త్యాగరాజ కళాపరిషత్ వ్యవస్థాపకుడైన మందలపు కాశిరెడ్డి తన సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించే అన్ని రకాల నాటకాల్లో పాల్గొంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నారు. దీంతో పాటు ఎన్నో అవార్డులను అందుకుని ప్రశంశలు పొందారు.



పాండిచ్చేరి యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శివశంకరాచారి

కష్టపడి పని చేస్తూనే..



ముత్తలూరి శివ శంకరాచారి (ఫైల్)

మండల కేంద్రానికి చెందిన ముత్తలూరి శివశంకరాచారి ఓ సాధారణ మెకానిక్. అయితే చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తితో ఎన్నో ఒడిదుడుకులు ఎదొర్కొన్న ఆయన ఇటీవలే పాండిచ్చేరి ప్రభుత్వంలో గౌరవ డాక్టరేట్ పొంది కళాకారునిగా అరుదైన గౌరవం దక్కించుకున్నారు. మెకానిక్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఎన్నో ప్రాంతాల్లో నాటకాలను ప్రదర్శించి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. దాదాపు 1500 పైగా ప్రదర్శనల్లో భళా అనిపించుకున్నారు. ముఖ్యంగా బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీర్‌గా, భూకైలాస్ నాటకంలో రావణబ్రహ్మ, సీతారామ కళ్యాణంలో రావణబ్రహ్మ, మోహినీ భస్మాసురలో భస్మాసురిడిగా, సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడిగా, వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకంలో వీరబ్రహ్మేంద్రస్వామిగా పాత్రలు చేసి అందరినీ మెప్పించారు. ముఖ్యంగా బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీరు పాత్రను ఎంతో అద్భుతంగా ప్రదర్శించి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. దీంతో ఇతని పేరు ప్రఖ్యాతలను గుర్తించిన పాండిచ్చేరికి చెందిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. గత ఆగస్టు నెల 10వ తేదీన పాండిచ్చేరిలో యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు గౌరవ డాక్టరేట్ అందజేసింది. భ్రమరాంభ కళా సమితి వ్యవస్థాపకుడైన శివశంకరాచారి నాటకరంగంపై ఆసక్తి ఉండి అవకాశాలు రాని ఎందరో నూతన కళాకారులకు చేయూతనిస్తూ నిరుపేద కళాకారులకు ఆర్థికంగా తోడ్పాటునందించారు.



మాయల ఫకీరు నాటకంలో ముత్తలూరి శివశంకరాచారి

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో కాటమరాజు స్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజు స్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించారు. నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కుబడులు చెల్లించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

యర్రగొండపాలెం: మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, అటువంటి వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని ఎస్సై చౌడయ్య ఆదివారం హెచ్చరించారు. యువత భారీ సౌండ్, వాహనాలపై స్టంట్ చేస్తూ వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని, అతివేగం, బైక్ సైలెన్సర్లు తీసి నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన రెడ్డి సంక్షేమ సేవా సంఘ కార్యవర్గం

యర్రగొండపాలెం: రెడ్డి సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఒంగోలు మూర్తిరెడ్డి, మోర్తాల సుబ్బారెడ్డి, శెనగ నారాయణరెడ్డి, బోగోలు వెంకట సుబ్బారెడ్డి, ముఖ్య సలహాదారులుగా యర్రం రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, యర్రం లక్ష్మీరెడ్డి, కొప్పర్తి ఓబులరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, అధ్యక్షుడిగా బిజ్జం రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆవుల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపు వెంకటేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఆవుల పెద్ద చెంచిరెడ్డి, సహాయ కార్యదర్శిగా పాలం నందిరెడ్డి, నారు నాసర్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, కోశాధికారిగా కొల్లి సత్యనారాయణరెడ్డి ఎంపికయ్యారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు బి.నరసింహులు అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక పై హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక ఇవ్వకుండా ప్రభుత్వమే ఉచిత ఇసుక పంపిణీ చేయాలన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తకార్డులు ఇవ్వాలని, పాతకార్డులను రెన్యువల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మాదాసు సేవలు అభినందనీయం



మాదాసు కృష్ణను సత్కరిస్తున్న నాయకులు

దర్శి: మాదాసు సేవలు అభినందనీయమని ఎంఈఓ కాకర్ల రఘురామయ్య అన్నారు. పీటీఎస్ ఫంక్షన్ హాలులో శేషం వారి పాలెం ప్రధానోపాధ్యాయులు మాదాసు కృష్ణ పదవీ విరమణ కార్యక్రమం ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి. రంగస్వామి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కృష్ణ దంపతులను ఉపాధ్యాయులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ రఘురామయ్య మాట్లాడుతూ ఇతర ఉపాధ్యాయులు కృష్ణ చేసిన మంచి పనులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ రమాదేవి మాట్లాడుతూ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకోవడమే కాకుండా నాడు- నేడు పనుల్లో మండల స్థాయిలో అవార్డులు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. జనార్దన్ రెడ్డి, డి. శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సాయి రాజేశ్వరరావు పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలను నడిపటం చట్టరీత్యా నేరమని చెప్పారు. వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. రోడ్డు నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఎస్సై వేమన పాల్గొన్నారు.

టమోటా రైతుకు తీరని నష్టం



తర్లుపాడులో నీటమునిగి చనిపోయిన టమోట పంట



మార్కాపురం మండలంలో నీటిలో తడిసి నేల రాలిన టమోటా

- మార్కాపురం ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు

తర్లుపాడు: అసలే పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి అంతంత మాత్రంగా ఉన్న టమోటా రైతులు అల్పపీడన ప్రభావంతో తీవ్ర నష్టానికి గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు పశ్చిమ ప్రకాశంలోని తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల, మార్కాపురం రూరల్, బేస్తవారిపేట, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం మండలాల్లో వందల ఎకరాల్లో పంట దెబ్బతింది. వ్యయ ప్రయాసలకోర్చి సాగుచేసిన పంట పక్వ దశలో ఉండి ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.50 వరకూ టమోటా విక్రయిస్తున్నారు. మార్కాపురం కూరగాయల మార్కెట్‌కు ఇంకా స్థానికంగా లభించే టమోటా రాకపోవడంతో బెంగుళూరు, మార్టూరు, కర్నూలు నుంచి ప్రతిరోజూ దిగుమతి చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కష్టాలు తీరుతాయని భావించిన రైతన్నలకు వర్ష ప్రభావంతో పంటల్లో నీరు నిలిచి మొక్కలు, పిందెలు దెబ్బతినడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఎకరాకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ పెట్టుబడి ఖర్చైనట్లు రైతులు చెబుతున్నారు. నీటమునిగిన పంట చూసేందుకు వచ్చిన అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంలేదని ఆవేదన చెందుతున్నారు.

మండలం	టమోటా సాగు ఎకరాల్లో
మార్కాపురం	36.53
తర్లుపాడు	43
కొనకనమిట్ల	13.74
దొనకొండ	0.50


ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న రెండెకరాల పొలంలో టమోటా పంట వేశాను. వర్షానికి ముందు టమోటా తోట పూత, పిందెతో ఉంది. కురిసిన వర్షాలకు నీరు నిలబడి పంట చనిపోయింది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి టమోటా పంట సాగుచేశాను. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– మేకల జనార్ధన్‌రెడ్డి, రైతు తాడివారిపల్లి

పంట నష్టం వివరాలు తెలియజేశాం



పంట నష్టం అంచనాను ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియచేశాం. అన్నీ మండలాల్లో పంట పొలాలను పరిశీలించి అంచనాలు తయారుచేశాం. ఉన్నతాధికారులకు పంట నష్టం నివేదిక అందచేశాం.

– రమేష్, హెచ్ఓ, మార్కాపురం

యూటీఎఫ్ అధ్యక్షునిగా నాసర్ మహ్మద్

పొదిలి: స్థానిక శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం రాత్రి యుటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాసర్‌మహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కామేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా యద్దం శ్రీనివాసులు, సహాధ్యక్షునిగా టి.నరసింహారావు, వైఎస్ఎన్ జ్యోతి, కోశాధికారిగా వై.హరిబాబు, మహిళా కార్యదర్శిగా పూల విజయలక్ష్మి, మండల కార్యదర్శులుగా జి.కాశిరెడ్డి, ఎం.రాజవర్ధన్‌రావు, టి.శ్రీనివాసులు, వి.వెంకటేష్, డి.రమణారెడ్డి, పి.చిన్న, జె.రంజాన్‌బీ, ఎం.సుస్మితారాణి తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు అబ్దుల్‌హై వీరిచే ప్రమాణం చేయించారు. యూటీఎఫ్ నాయకులు పి.బాలవెంకటేశ్వర్లు, పోలు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లి, తిప్పాయపాలెం గ్రామాల్లో సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు.

పోలేరమ్మ తల్లి చల్లగా దీవించమ్మా..!



ప్రత్యేక అలంకణలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ చల్లగా దీవించమ్మా అంటూ భక్తులు మొక్కుకున్నారు. పోలేరమ్మ కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలోని నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని మార్కాపురం పట్టణ శివారులో ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.